

# శోభారాణి

నెలరోజులక్రితము శోభారాణి ఎవరో నాకు తెలియదు. నెలరోజుల తర్వాత బహుశా ఆమె రూపాన్ని నేను చూడలేకపోవచ్చు. కాని నా చివరి ఘడియలలో "నీ జీవితకాలములో అమూల్య ఘట్టము యేమిటని" ప్రశ్నిస్తే నిశ్చయముగా, శోభారాణితో పరిచయమే అని అంటాను.

చరిత్రగతి మార్చగలిగినవాళ్లూ, నవ్యపథమును నిర్మించగలిగినవాళ్ళు చాల అరుదుగా వుంటారు. అటువంటి అపురూప వ్యక్తులలో, శోభ ఒకత్తె అని గ్రహించగలిగాకనే, ఆమె జీవితపు విలువలు గ్రహించగలిగాను.

* * *

శోభ శానిటోరియములో రోగి. నేను అచ్చట కొత్తగా ప్రవేశించిన డాక్టరుని. శోభ వున్న గది, తక్కిన గదులకన్నా అందముగావుంటుంది. యిది తక్కిన గదులకి దూరంగావుంది. గది కిటికీలోంచి చూస్తే పచ్చని బయలు ఆ బయలు వెనుక రోడ్డు ఆ రోడ్డు వెనుక చెట్లు, ఆ చెట్లవెనుక కొండలు, ఆ కొండలమీద తెల్లని మబ్బులు—ఏదో రమణీయ ప్రకృతి చిత్రముచూస్తున్నట్లు వుంటుంది. ఆ కిటికీ ప్రక్కనే శోభారాణి మంచము.

"శోభారాణి తీవ్ర క్షయవ్యాధిగ్రస్తురాలు. అశ్రద్ధవలన బాగా ముదిరిపోయింది. ఆమె బ్రతికే అవకాశాలు చాలా తక్కువని, ఆమెని పరీక్ష చేసిన మొదటిదినమే గ్రహించాను. ఆమె గత చరిత్రగురించి చాల అసహ్యముగా చెప్పుకోవడము విన్నాను. ఆమె తన కల్మష చరిత్రగురించి బాధపడ్డముకాని, పశ్చాత్తాపపడడముకాని, ఎప్పుడూ లేదని విన్నాను. అటువంటి స్త్రీని జబ్బు కుదురుతుందన్న ఆశలేని ఆ స్త్రీని శానిటోరియములో నే జేర్చుకోకూడదని భావించేవారుకూడావున్నారు. అటువంటి శోభారాణిపై ముందర నాకు నిరసన భావము కలగడము ఆశ్చర్యముకాదు.

నేను ఆమెని మొట్టమొదటిసారిగా చూడక మునుపే, యీ నిరసనకలిగింది. అయితేనా వృత్తిధర్మాన్ని నేను నిర్వర్తించవలసిన బాధ్యత నామీద వుంది. ఆ వుద్దేశముతోనే ఆమెదగ్గరకు తక్కిన అందరి రోగులదగ్గరకు వెళ్ళినట్లే వెళ్ళాను.

అంతవరకు దగ్గుతూ ఆ కిటికీలోంచి బయటికి చూస్తూన్న ఆమె నా బూట్లచప్పుడు విని లేచి కూర్చుని నమస్కరించింది. టెంపరేచరు ఛార్టు, లంగ్సు పరీక్షించి ఆమెకు యింజక్షను యిస్తున్నా. ఆమె నిరాశగా, "డాక్టరుగారూ! ఈ యింజక్షనులన్నీ నాకు నయమవుతుందన్న ఆశతోనే యిస్తున్నారా?" అని అంది. "ఎందుకు కాకూడదు?" అన్నాను. రోగులకు ధైర్యముచెప్పవలసిన బాధ్యత నామీదవుందిగా! "బలేడాక్టర్లు. యింకో నిముషానికిపోయే రోగికయినా, ప్రాణభయము లేదని ధైర్యము చెపుతూ వుంటారు" అంది హేళనగా.

ఈ హేళనలో నిజములేకపోలేదు. అందుకనే అది ఎత్తిపొడుపుగా, అనిపించి, చాల కటువుగా అనిపించింది. "అయితే చచ్చిపోవడము ఎలాగా తప్పదనుకొనేదానివి యిక్కడ ఎందుకు చేరావు? నీవు పోతే యింకోరోగికి అవకాశముండేదిగా!"

కంచి వాసుదేవరావు

అన్నాను చాలా కటువుగా. మనసును గాయపర చాలన్న సంకల్పముతోనే.

"మీరుచెప్పినది అక్షరాల నిజమే! నాకు చచ్చి పోవడానికి వేరుచోటులేక యిక్కడచేరాను; మీ వంటివారికి శ్రమయివ్వడానికి ఇష్టములేకపోయినా నా చావుకు ప్రతినిముషము ఎదురుచూస్తున్నా. నాచావు నాచేతుల్లో లేదుగా. వుంటే, మీచేతు లలోవుంది కాని" అంటూ ఆ కిటికీవంక తిరిగి పడుకుంది.

అనవసరముగా ఆమె మనస్సుని గాయపరచా నన్న బాధకన్న ఎక్కువ యీ జవాబు నాకు ఆశ్చర్యము కలిగించినది. ఆసుపత్రులకి రోగాలు కుదుర్చుకొని బ్రతకడానికి వస్తారు కాని చావ డానికి వస్తారు అని వినడము యిదే మొదటిసారి.

"నీకు ఎవరూలేరా? ఇల్లూ వాకిలీలేవా? ఒక్కదానివే వుండడానికి భయము వేయడము లేదా?" మృదువుగా అడిగాను.

"భయందేనికి డాక్టరుగారూ? నాకు ఎవరూ లేరు! చావంటే భయం దేనికి? ఇక్కడ కరు వయిన శాంతిసౌఖ్యాలు లభించేది అక్కడేగా? మృత్యువును రెండుచేతులతో నిండు హృదయ ముతో ఆహ్వానిస్తాను."

ఆరోజున యిక నేను మాట్లాడలేదు. కాని ఈ సంభాషణ మూలంగా ఆమెపట్ల నిరసనభావం కొంతవరకు తగ్గింది. పాపాలుచేసేది మనలాంటి మనుష్యులేనని, వారికీ ఆత్మాభిమానం ఉంటుందనీ గ్రహించాను. ఆమెకు సహాయపడాలన్న ఆసక్తి కలిగింది. ఆనాటినుండి ఆమెను కలుసుకుని ఆమె గురించి తెలుసుకునే అవకాశాలు కల్పించు కున్నాను. ఆమెతో మాట్లాడిన ప్రతి విషయము ప్రస్తుతించడము యిచట అనవసరము. ఆమెపట్ల వున్న నిరసనపోయి గౌరవాభిమానాలు కలగడా నికిగల సన్నివేశాలొకటి రెండింటినే చెపుతాను.

* * *

ఆరోజు రాత్రి నాకు డ్యూటీవుంది. రౌండ్సు పూర్తిచేసుకుని చివరకి, శోభారాణి దగ్గరకు వచ్చాను. ఖంగు ఖంగున దగ్గు వినిపిస్తోంది. నేను వెళ్ళేటప్పటికి ఆమె మామూలుగా కిటికీలోంచి బయటకి చూస్తూంది. పున్నమివెన్నెల ఆమె పాలి పోయినముఖముమీదపడుతోంది. మబ్బుల అడ్డము లేని స్వచ్ఛమయిన వెన్నెల గడ్డిపరకనుంచి, కొండ శిఖరమువరకుగల ప్రతివస్తువునీ తెల్లకాంతులలో ముంచెత్తుతోంది.

నా బూట్లు చప్పుడుకూడా ఆమె వినిపించు కోలేదు. బయట చల్లగాలి వీస్తోంది. దానికి యక్స్పోజ్ అవడము ఎంత ప్రమాదకరమో ఆమె గ్రహించినట్లు లేదు. నేను వెళ్ళి తలుపు వేయ బోయాను.

"మీరాతలుపు వేయకండి."

"ఏం! ఈ పద్ధతి ఎంతప్రమాదమో తెలుసా?"

"ఆసంగతులు నాకు తెలియకపోలేదు డాక్టరు గారూ నేను అట్టే కాలము బ్రతకనని మీకన్నా నాకు బాగా తెలుసు. బయట వెన్నెల చూడండి ఎంత బాగుందో. యీ జీవితములో యింత నిర్మల మయిన వెన్నెలని చూడగలుగుతానా? ఆఖరు సారి యీ వెన్నెలనిచూసి ఆనందించనివ్వండి."

"బాగుంది అల్లాఅని ప్రాణము మీదికి తెచ్చు కుంటావా?"

"ప్రాణముమీదికి యిదివరకే వచ్చింది. దానికి సిద్ధముగానే వున్నాను. చచ్చిపోయేముందు ప్రతి ఘడియ ప్రతినిమిషము యిటువంటి సౌందర్యాన్ని చూస్తూ చచ్చిపోవాలి."

"మొండివాదానికేంవచ్చేలే" అని తలుపు వేయబోయాను. "వేయకండి డాక్టర్ నేను చెప్పింది నిజము. నామాట వినరూ?" చాలా దీన ముగా అడిగింది.

నిజమే! ఆమె మాటలలో ఏం అసత్యముంది? ఆమె మనసుని కష్టపెట్ట దలుచుకోలేదు. ఆ ప్రయత్నం విరమించి... ఆ పక్క స్టూలుమీద కూర్చున్నాను.

శోభారాణికి బ్రతకాలన్న కోరిక విమాత్రము లేదు. నేను ఎంతమందో విరాగులనీ భగ్నహృద యులనీ చూచాను. కాని ఈమె మరణానికి సిద్ధ మయినంత నిర్విచారంగా, మరణించాలన్న వాంఛ ఈమెకున్నంత తీవ్రంగా వారికిలేదు. వారిలో ఎక్కడో బతకాలన్న కోరిక వుండేది. అది ఈమెలో ఎక్కడా లేదు. మరి జీవితమింత రోసి నది ఆత్మహత్య ఎందుకు చేసుకోలేదో అను మానమే! జీవితమంటే యింత విరక్తి పుట్టడానికి

కల కారణాలేమిటో తెలుసుకోవాలన్న కుతూహలం ప్రబలమయింది.

"శోభా! ఎందుకు నీకింత విరక్తి?" అని అడిగాను.

"చెప్పు శోభా! చిన్నదానివి, చాలా జీవితము అనుభవించవలసినదానివి... ఎందుకు మరణాన్ని అంతగాఢంగా వాంఛిస్తున్నావు?... చెప్పు..." అడిగాను. నాకు తెలియకుండానే ప్రతిముక్కలో ఆవేదన కనపడింది..

నా మొగమువంక చూసి, కాసేపు వూరుకొని "నిజమే! చచ్చిపోవాలనుకుంటున్నాను. ఎందుకని..ఏంచూచుకొని, ఎవరికోసం బ్రతకాలి?... నేను బ్రతకాలనికాని నేను కావాలని, కోరుకునే వాళ్లులేరు. నన్ను సహ్యించుకుని.. ద్వేషించే పాడు ప్రపంచంలో నాకు చోటులేదు..."

పాడుప్రపంచం! అడ్డమయినతిరుగుళ్ళు, తిరిగి ప్రపంచాన్ని దుయ్యబడితే లాభమేముంది? "మనని అసహ్యించుకోవడానికి, ద్వేషించడానికి బాధ్యత సంఘానిదికాక, మన ప్రవర్తనమీద ఆధారపడివుంటుందని తెలుసా?.." ఈ మాటలు ఆమె వ్యక్తిగత జీవితానికి తగలాలనే అన్నాను.

"తెలుసు డాక్టరుగారు! ప్రపంచములో అందరు వ్యక్తులూ మనకి అర్థము అవుతారని అనుకోవడము మనబుర్రలకి అర్థమయినప్రకారము తీర్పుయివ్వడము న్యాయంకాదు. ఎవరినయినా ప్రేమించలేకపోవడానికి కారణం అతన్ని అర్థం చేసుకోలేక పోవడమే."

"ఏమిటీ నీ సిద్ధాంతము? అయితే హంతకులని, గజదొంగల్ని, వ్యభిచారులని ద్వేషించడమంటే వాళ్ళని అర్థంచేసుకోలేకపోవడమా? అర్థంచేసుకున్నందుకు గుర్తు వాళ్ళ ఘోరకృత్యాలని సమర్థించడమా?... అంతేనా?"

"డాక్టరుగారు! అంత ఆవేశ పడితే నిజము తెలుసుతేలేరు. నిజమే వాళ్లు ఘాతుక కృత్యాలు చేస్తున్నారు. ఎందుకనో? ఎప్పుడయినా ఆలోచించారా మీలాటి పెద్దమనుష్యులు నీతివంతులు? ఆ పరిస్థితులలో మనమూ వుంటే, ఆసాహసమే మనకీవుంటే...మనము అదేచేసే వారిమేమోనని ఆలోచించారా?"అంది...

"అయితే! యింతకీ నిన్నెవరూ ప్రేమించలేకపోవడానికీ, ద్వేషించడానికి కారణము నిన్ను అర్థంచేసుకోలేని మూర్ఖులన్న అహంకారముతప్ప. నీవుచేసిన దౌర్భాగ్యపు పనులని సమర్థించలేకపోవడమని వప్పుకోవు.." ఈమాటలు చాలా కటువుగా అన్నాను.

ఈవాక్యములు వింటుంటే ఆమెమొగము ఎర్రబడి పోయింది. పాలిపోయిన పెదిమలు ఉద్రేకంతో మెలికలు తిరుగుతున్నాయి..గొంతు సవరించుకుని ...

"అదే నేనుచెప్పేది. నేను మీ అందరిదృష్టిలో చేయరానిపనులు చేశాను. అందుకనే అందరూ నన్ను వదిలివేసారు. నాగురించి ఎవరియిష్టము వచ్చిన అభిప్రాయాన్ని వారు ఏర్పర్చుకోవచ్చు. కాని నేను ఎందుకు కులటనయ్యానో నా సంజాయిషీ అయినా వినకుండా తీర్పుయిచ్చే అధికారం వుంటుందిఅన్న భావం మీకుంటే వుండవచ్చు...కాని ఆ తీర్పునకు విలువ యివ్వవలసిన అవుసరం లేదు." ఈమాటలు బాగా ఆవేశంతో అందేమో బాగా ఆయాసము దగ్గువచ్చి...చాలా సేపటివరకు మాట్లాడలేదు.

నేనూ మాట్లాడలేదు... మరిరెండు నిమిషాలు అక్కడ కూర్చుని వెళ్ళిపోయాము. ఆమె మాట్లాడిన దానిలో అసత్యములేదు. నిజమే! ఆమె జీవితము గురించి తెలుసుకుని యింతకన్న భిన్నమైన అభిప్రాయముఏర్పరచుకోగలనేమోచూడాలి. కాని అది సమయంకాదు. ఆనాటికినేను వెళ్ళిపోయాను.

ఈ సంఘటన జరిగిన రెండురోజులకి తిరిగి శోభను కలుసుకున్న సమయంలో "శోభా! నీకు జీవితములో నిరాశ తప్ప ఏంలేనిమాట నిజమే! కాని చచ్చి సాధించగలిగినదేమిటి? అసలు ఆ లోకమేవుందోలేదో! ఇక్కడలేని శాంతిసౌఖ్యాలు నీకక్కడ లభిస్తాయా?" అని అడిగాను.

"డాక్టరుగారూ! ఆకొండవెనకాల ఏముందో తెలుసా? అచ్చట చిట్టడవిలో ఏ సుందరోద్యానవనాలున్నాయో తెలుసా మీకు? మీరు ఆకొండనతిక్రమించగలిగితే ఆవెనుక ఏముందో తెలుసుకోగలరు. కాని అవిటివాడు అక్కడేముందో సరిగా తెలుసుకోగలడా? ప్రపంచంలోవున్న సౌందర్యాన్ని వికారాన్ని, వెలుగు చీకట్లని కళ్లున్నవాడు చూడగలడు. కాని గుడ్డివాడికేం తెలు

స్తుంది? వాడికి ఎప్పుడూ కనిపించేది చీకటి. కాని వాడు తను ఎప్పుడూ చూడని, ఎన్నడూ చూడలేని ప్రపంచాన్ని గురించి... తను వూహించగలిగినంత సౌందర్యవంతమయినదిగా ఊహించుకుంటాడు. అట్లాగే ఆవిటివాడు వీరికి నిజము తెలిసే అవకాశము ఎన్నటికీ లేదు. ఎప్పటికయినా ఊహించుకోవలసినదే! ఆ ఊహ ఆనందమయిన అనుభూతికల్గించేవాటినిగూర్చి ఎందుకు ఊహించుకో కూడదూ? నాకు యీ లోకంలో శాంతి లేదు. ఎక్కడచూసినా నిరాశ. ఎక్కడ చూసినా యీ సడింపు. నేను ఆ లోకాన్ని చూడలేదు... కాని ఆలోకం వుందని, చనిపోయేవారు అక్కడికి వెళతారని అక్కడ శాంతిసౌఖ్యాలు లభిస్తాయన్న అభిప్రాయాల్ని బలపరచుకొని యిక్కడ విచారాలు మరచిపోయి, మరణానికి సిద్ధమయి, మృత్యుభీతిని తొలగించుకోవడము దోషమా?"

ఈ సంఘటన తర్వాత ఆమె సామాన్య స్త్రీ కాదని... సామాన్యులు అందలేని అంతస్థుచేరిందని గ్రహించగలిగాను. నేను ఆమెకి రోజు రోజుకీ సన్నిహితుడనవుతున్నాను. ఆమె అంతే! కాని ఏంలాభము? ఆమె జీవితము చాలా కొద్ది రోజులకే పరిమితమయినది. ఇంత సంస్కారము గల స్త్రీ పతిత ఎలా అయిందనే అనుమానం. ఒకరోజున ఆమెనే అడిగాను.

* * *

"నేను పతితనయితే దానికి కారణాలు: విలక్షణమయిన నా మనసు, నా యభిప్రాయాలు. నేను చిన్నప్పటినుంచీ చాలా పెంకిమనిషి నని పించుకున్నాను. కాని నా అభిప్రాయాల మార్చుకోలేకపోవడమే నన్ను పెంకిదాన్ని చేసింది. నేను స్కూల్ ఫైనల్ వరకూ చదివాను. అందమైనదాననే అందరూ అంటూవుంటారు. మానాన్న నాకిష్టంలేని పెళ్లి చేయబోయాడు. నా అనంగీకారము తీవ్రముగా తెలిపాను. కాని ఫలితము లేకపోయింది. నా పెళ్ళికి నా అభిప్రాయాలను, నా అభీష్టములను లక్ష్యంచేయకపోవడము, దారుణమనిపించింది. ఆ దారుణానికి లొంగిపోగూడదనుకున్నాను. చచ్చి ఏంసాధించలేం. ఆ వుద్దేశాన్ని తలపెట్టకుండా యిల్లువదలి మద్రాసు పారిపోయి వచ్చాను.

"మీరెప్పుడయినా మేల్కొని నడుస్తూ కలలు కనేవాళ్ళని చూశారా? ఆ రోజులలో ఆ రైలు ప్రయాణాలు కొద్దిగంటలలో తర్వాత కొద్దిరోజులు ఎన్ని మధురస్వప్నాలు కన్నాను! నేను సినిమాలలో కథానాయికగా ఎన్నికయినట్లు, నా మొట్టమొదటి చిత్రమే అఖండవిజయాన్ని సంపాదించుకొని నన్ను తారాపథంలో చేర్చినట్లు, తర్వాత సినిమా తరవాత సినిమాలో వరసగా నటించినట్లు, లక్షరూపాయల చెక్కు అందుకున్నట్లు, యిటువంటి కలలు చాలా కన్నాను. కాని కళ్ళు తెరచి నిజం తెలుసుకుంటే ఎంతో బాధాకరంగావుండేది. సినిమాలలో అవకాశాలు గగనకుసుమాలై ఉద్యోగాలకి ప్రయత్నించాను. కాని అంత తేలికగా వుద్యోగాలు దొరకుతాయా? నేను సాహసము చేసినట్లు భావించుకుని నా "వీరోచిత గాథ" హృదయముందియనుకున్న ప్రతివారికీ చెప్పి వారి సానుభూతిని పొంద ప్రయత్నించేదాన్ని.

"ఇక్కడ నాకొక అభ్యుదయ భావాలు గల మహనీయుడొకడు దొరికాడు. నా స్థితిగూర్చి జాలిపడి, వుద్యోగమిచ్చాడు. పెళ్ళిచేసుకుంటానన్నాడు. అంతవరకు బాగానేవుంది. కాని ప్రతిక్షణమూ అతను తను చాల అధికుడనని, నరకకూపములోవున్న నన్ను పైకిలేవనెత్తాడని దానిని ప్రతిక్షణమూ నేను గుర్తుంచుకోవాలని భావించేవాడు. ప్రతిక్షణమూ ఆ విషయమే గుర్తుచేస్తూ వుండేవాడు. నా కష్టసమయంలో ఆయన తోడ్పడడానికి వచ్చినమాట నిజమే! కాని ఎంతసేపని, ఆయన అధికుడనని, నేను అల్పురాలినని భావించబడుతూ కూర్చోవడము? ముందు తోడ్పడి, తర్వాత ప్రతిక్షణము తనుచేసిన యుపకారాన్ని నా అప్రయోజకత్వాని గుర్తింపచేస్తూ సంతోషించడంకన్న నీచులు నాకు కనిపించలేదు. అంతే కాదు నాలాంటిదానికి దానిని భరించడము దుర్భరమయింది. అందుకనే ఆయనని విడచిపెట్టాను. పాపం విశ్వాసఘాతకురాలి ననుకుంటాడు. అది సరే. ఇకముందుగతి?

"ఇష్టమున్నా లేకపోయినా, ఇంటికి వెళితే ఆదరిస్తారేమోనని ఇంటికి పోయాను. అక్కడ వాతావరణము భిన్నముగాలేదు. ఎక్కడచూసినా సూటిపోటి మాటలే! వారి ప్రతిమాటలోనూ ప్రతి

ముఖకవళికలలోను, నేను కులటనని యీసడిస్తూ వుండేవారు. ఇంట్లో ఎరుగున్న వాళ్ళకి అదే అభిప్రాయము. అటువంటి వాతావరణములో అసలుండలేకపోయాను. తిరిగి వచ్చేశాను.

"ఎల్లా బ్రతకాలి? నా అందము నన్ను మర్యాదగా బతకనివ్వదు. సంఘము దృష్టిలో నేను కులటను. రెండుసార్లు 'లేచిపోయినదాన్ని.' నా అందాన్ని ఆశించేవారున్నారు. సరే చెప్పేందుకేముంది?...యిష్టము లేకపోయినా 'చెడు' దారి త్రొక్కాను. నైతికపతనము చెందాను. కులటను, నిజమే! ఒకరికి లొంగడము యిష్టములేని నాకు సంఘానికిలొంగి క్షుద్రజీవితము గడపడముకన్న, సంఘానికెదురుతిరిగి, కల్మషజీవితము గడపడము యుత్తమ మనిపించింది.

"ఇక చెప్పేందుకేముంది? నాలుగయిదేళ్లు గడిచాయి. కొద్ది ఆస్తి సంపాదించుకోగలిగాను. కాని యీ జబ్బులపాలబడ్డాను. నేను కూడ పెట్టిన ఆస్తి ఖర్చు చేస్తున్నాను. ఈ స్థితిలో నా దగ్గరకి వచ్చేవారు ఎవరు? మృత్యువుకోసము ఎదురు చూస్తున్నాను.

"నేను ముందరే మాతండ్రి తెచ్చిన సంబంధాన్ని చేసుకున్నా తర్వాత ఆ అభ్యుదయ యువకుని "సంస్కారాన్ని" భరించగలిగినా యింటికి చేరినతర్వాత ఆ వాతావరణములో వుండగలిగినా నా జీవితము యింత నికృష్టమయేది కాదు.

"ఏ ఆనాలేని నేను, ఎందుకు ఆత్మహత్య చేసుకోలేదు అని అడగవచ్చు. ఆత్మహత్య ఏ సమస్యని పరిష్కారము చేయలేదు. నాకయి నేను మృత్యువుని వరిస్తే పరాజయమును అంగీకరించినట్లేగా?

"ఈ జబ్బులన్నీ ముదిరి క్షయలోకి దింపాయి. నేను చాలా అశ్రద్ధచేసాను. ఇక బ్రతకడము అసంభవమని గుర్తించి చివరికి యీ శానిటోరియములో చేరాను.

"ఈ శానిటోరియములోనైనా నన్నెవరు గౌరవముగా చూసారు? నన్నర్థము చేసుకోవడానికి ప్రయత్నించలేనివాళ్లు నామీద అభిమానములేనివాళ్లు నన్నెలాచూస్తే నాకేం? ఇంతలో డాక్టరు సారథిగారి పరిచయ మేర్పడింది.

ముందు ఆయనకూడా నన్ను నిర్లక్ష్యంగా చులకనగా చూసేవాడు. అందులో అసహజత్వమయింది? కాని తర్వాత తర్వాత నాపట్ల సానుభూతి చూపించడము, నాపట్ల శ్రద్ధవహించడము చూసాను."

* * *

పదిహేనురోజుల క్రితము శానిటోరియములో ఒకరోగి చచ్చిపోయింది. ఆరోగి భర్త కాబోలు ఆ శవముమీదపడి గుండెలుపగిలేట్టు ఏడ్చాడు. ఎవరూ అతన్ని వారించలేకపోయారు. భార్యంటే ఎంత ఆపేక్ష. ఈ సంఘటన నా మనస్సును కలచింది.

ఆ రోగి చచ్చిపోతే, ఆమెని ప్రేమించే భర్త వున్నాడు కనుక అలా విలపించాడు. కాని నేను చచ్చిపోతే, నాగురించి ఒక కన్నీటిచుక్క విడిచేవాళ్లున్నారా! డాక్టరు సారథి ఏదో ఆప్యాయముగా మాట్లాడుతున్నంత మాత్రాన, నన్ను ప్రేమించగలడా? సంఘాన్ని ధిక్కరించాను, జీవితమంతా పోట్లాడాను. కాని ఏం లాభము? జీవితములో ఒక ప్రేమించే హృదయాన్ని సంపాదించలేకపోయాను. ఎంత నిరర్థకమయిన బ్రతుకు. ఆ రాత్రి యిదే ఆలోచిస్తున్నాను. తలుచుకుంటే దుఃఖము ఆగటంలేదు.

ఎంతసేపు అలా పడుకున్నానో తెలియదు. డాక్టరు సారథి వచ్చి "ఏడుస్తున్నావా శోభా! తప్పుకాదూ" అని అడిగాడు. కళ్లు తుడుచుకుని, "లేదు. మాశారా... ఆ మనిషి భర్తట, ఎంత జాలిగా విలపించాడో" అన్నాను.

"అవును భార్యని, అంతగా ప్రేమిస్తున్నాడు పాపము!"

"అంతగా ప్రేమింపబడే అదృష్టము అందరికీ వుంటుందా? నిజముగా నన్ను ఆ విధముగా ప్రేమించగలిగినవారు ఒక్కరయినా యీ లోకములో వున్నారా? నిజముగా అటువంటి వ్యక్తి వుంటే చచ్చిపోయేలోగా అతని పాదాలమీద తలపెట్టుకుని అతని ముఖమువంక చూస్తూ చచ్చిపోతాను. బ్రతికుంటే, అతనిని సేవించి తరిస్తాను. ఎవరా వ్యక్తి? అని రెండు చేతులలో ముఖము కప్పుకుంది.

"బాధపడకు శోభా! నేను వున్నాను. నీ జీవి

తప్పు విలువ గ్రహించాను. నేను నిన్ను ప్రేమిస్తున్నాను!"

ఈ మాటలు నా కెంత సంతృప్తి కలిగినవో చెప్పలేను. నా జీవితమంతా తెలుసుకుని బాగా నన్ను ప్రేమించి నన్ను గౌరవించగలిగితే, యిక కావల్సిన దేముంది? "నిజముగానా?" అని అడిగాను.

"నిజము శోభా! నిజము... యిక నీవు నా దానివి... సరేనా?" అన్నాడు.

"ఎన్నాళ్ళకి నాజీవితంలో ఓ ఆశారేఖ కనిపించింది. డాక్టరుగారూ మృత్యువుకి సిద్ధమయిన నన్ను బ్రతకడానికి ఆశకల్గిస్తున్నారు. జీవితంలో సారథిని చాలా ఆలస్యముగా చూచాను. ఏం లాభము? ఏం ప్రయోజనము? బ్రతకవలెనన్నా, యింక బ్రతకలేను. పోనీ చచ్చిపోయే ముందయినా నన్ను అర్థం చేసుకొని ప్రేమించగలిగిన వ్యక్తినొక్కరినయినా చూశాను. నా మరణానికి బాధపడేవాళ్ళు, నేనులేకపోతే వెలితిగాభావించే వారిని పొందగలిగాను. అదే నాకు తృప్తి! నా జీవితము సార్థకమయినది చిట్ట చివరకు!

---

క థా ని క

# ఇదీ జీవితం

## నా. రామనాథ్

దుమ్మునూ - ముళ్ళపొదలనూ చీల్చుకుంటూ- మలుపులు తిరుగుతూ పోతున్న రోడ్డు పోయి పోయి - చివరికి ఒక చెలమవద్ద అంతమైపోయింది. దానిఒడ్డునే - నిద్రించే పహరా జవానులా - నీరసంగా ఓ మామిడిచెట్టు. చెట్టుక్రింద జీవితపుతుది నిశ్వాసను విడుస్తూ ఓ అభాగ్యజీవి. ఒక కాలు మడచి రెండో కాలు జలాశయంలోకి జార్చాడు. చేతులురెండూ బారచాచివున్నయ్. ఊహాతీతమైన శక్తియేదో తనతో తొలిసారిగా - బహుశా అదే తుదిసారికూడాను - దాగుడుమూతలాడటంచూచినపుడు తాను పొందిన సంభ్రమాశ్చర్యాది అనుభూతులు ఆ కళ్ళల్లో ముద్రితమై - ఇంకా ఆ భావాన్నే వ్యక్తంచేస్తున్నయ్. మృత్యుదేవతతో పోరాడుతూ అంతిమ క్షణాల్లో అతను-

బారెడు ప్రొద్దెక్కింది. నలువైపులనుండీ చీమలు బారులుబారులుగా వచ్చి మృత్యదేహంపై ప్రాకుతూ వీలయిన ప్రతిచోటికీ— నేత్రాల్లోకీ- ముక్కులోనికి - కర్ణరంధ్రముల్లోకి చొచ్చుకుని పోతున్నవి. కలతచెందిన నీడలు తారట్లాడుతున్నయ్, ఇంతలోకే పసిబాలుడు ఒకడు బంతి ఆడుకుంటూ ఆదారికి వస్తున్నాడు. ఉన్నశక్తినంతటినీ కేంద్రీకరించి బంతినితన్నాడు. ఉవ్వెత్తుగా - తారజువ్వలా బంతిపైకి ఎగిసింది జారే బంతినిచూస్తూ కేరింతలుకొడుతూ చేయిచాచాడు. కొద్దిలో పట్టుతప్పిపోయి ఎగురుతూ ఎగురుతూ- దొర్లుతూ - దొర్లుతూ - మట్టిదిబ్బ వెనుకకు జారి అదృశ్యమైపోయింది. దాన్ని అనుసరిస్తూనే కుర్రాడు - శవాన్ని - దాంతో ఆటలాడుకుంటున్న చీమలసమూహాన్ని చూచాడు. ఓక్షణం ప్రశాంతం-ఆ వెను వెంటనే భయంతో సానుభూతి పూర్వకంగా ఓ కేక అతని పెదవులనుండిజారింది. తను వచ్చినదారినే అరచుకుంటూ అరచుకుంటూ అ ర చు కు ం టూ — ఒ క్కొ క్క ళ్ళే రావటం ఆరంభించారు. దేహంచుట్టూ గుమిగూడి, అతను చనిపోవటానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. ఇంతలోకే ఒకడు బండీ తోలుకువచ్చాడు. అంతా కలసి మృతదేహాన్ని బండిపైకి ఎక్కించి తో లు కు పో యా రు. జనం సర్దుకున్నా, ఇంతవరకూ మౌనంగావున్న పక్షులు కిచకిచమని మాట్లాడుకోవటం ఆరంభించినయ్. గాలివీయగానే చెట్టు ఆకులు బాధాపూరిత నిస్వనం విడిచినవి. అప్పుడప్పుడూ గుసగుసలాడే పక్షి పిల్లలు-అన్నిచోట్లా ప్రశాంతత ఆవరించింది.

అన్నిచోట్లా చీకటి—